కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వం

మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 7: కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాం లో వ్యవసాయమే ప్రథమ ప్రాధాన్యతగా భావించి ముందుచూపుతో అన్ని చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. నేటి ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా వ్యవసాయాన్ని తిరోగమనానికి నెట్టిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పంటలు ఎండిపోయాయని, అందుకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం అందజేయాలన్నారు. ఆకలిచావులు, ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న తెలంగాణ దేశానికి అన్నంపెట్టే స్థాయికి ఎదిగిందని, కానీ తిరిగి మళ్లీ తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు.

‘గౌరవెల్లి’ని పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే

సాంబరాజు

అక్కన్నపేట, ఏప్రిల్ 7: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో 95శాతం మేర పూర్తైన మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బాధ్యతగా తీసుకొని మిగతా పనులను పూర్తి చేసి సాగునీరందించాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయన్నారు. తలాపున గౌరవెల్లి ప్రాజెక్టు ఉన్నా కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే గౌరవెల్లి ప్రాజెక్టు ట్రయల్‌రన్ విజయవంతమైందన్నారు. ప్రాజెక్టులో ఒకటిన్నర టీఎంసీల గోదావరి జలాలు నిల్వ ఉన్నాయని, మిగతా పనులను పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతాంగాన్ని అదుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టు గురించి మాట్లాడటం సరికాదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ రెండు సార్లు పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. సతీశ్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. త్వరలోనే కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పకతప్పదన్నారు.

తిరుపతయ్యకు ‘పండిత పురస్కారం’ ప్రదానం

పండిత పురస్కారాన్ని అందుకుంటున్న తిరుపతయ్య

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 7: మద్దూరు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడిగా సేవలందిస్తున్న పానుగంటి తిరుపతయ్యకు ఆదివారం సిద్దిపేట జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది మహోత్సవ పండిత పురస్కారాన్ని అందజేశారు. గతంలో తిరుపతయ్య స్వర్ణ నంది అవార్డుతో పాటు జ్యోతిర్వాస్తు పురోహిత నిధి బిరుదును పొందారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఉగాది మహోత్సవ పండిత పురస్కారాన్ని అందజేసిన విశ్వబ్రాహ్మణ అర్చక, పురోహిత సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఇస్రో శిక్షణకు విద్యార్థిని ఎంపిక

మొగిలి హరిత

గజ్వేల్, ఏప్రిల్ 7: దేశ వ్యాప్తంగా ఇస్రో ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించడానికి ఫిబ్రవరిలో ఆన్‌లైన్‌లో క్విజ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతిభ చూపిన తొమ్మిది మంది విద్యార్థులను ప్రకటించగా, అందులో ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని మొగిలి హరిత ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మే 13 నుంచి 24వరకు హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇస్రో ప్రకటించిందని తెలిపారు. ఇస్రో శిక్షణకు ఎంపికైన హరిత, గైడ్ చేసిన ఉపాధ్యాయురాలు నాగలక్ష్మిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కోర్టు ఏర్పాటుకు కృషి

మాట్లాడుతున్న చేర్యాల ప్రాంత న్యాయవాదుల నూతన అడహక్ కమిటీ సభ్యులు

చేర్యాల, ఏప్రిల్ 7 : అనివార్య కారణాల వల్ల చేర్యాల పట్టణంలో కోర్టు ఏర్పాటు అంశం వాయిదా పడుతూ వస్తున్నదని త్వరలో కోర్టు ఏర్పాటు చేసేందుకు చేర్యాల ప్రాంత న్యాయవాదులు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని చేర్యాల ప్రాంత న్యాయవాదుల నూతన అడహక్ కమిటీ కన్వీనర్, సీనియర్ న్యాయవాది ఆరేళ్ల వీరమల్లయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని కోర్టు ఏర్పా టు ప్రాంగణంలో చేర్యాల ప్రాంత న్యాయవాదుల సమావేశం జరిగింది.ఈ సందర్భం గా కోర్టు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నూతనంగా చేర్యాల ప్రాంత న్యాయవాదులు అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది ఆరేల్ల వీరమల్లయ్య, కోకన్వీనర్లుగా న్యాయవాదులు గాజుల రవీందర్, మేరుగు రమేశ్‌తో పాటు న్యాయవాదులు గూడెం శ్రీధర్, మోకు రాజిరెడ్డి, నల్ల గొండ సంతోష్, గుస్క వెంకటేశ్, నీరటి వెంకటేశ్, దర్శనం ప్రశాంత్, అనంతోజు వెంకట కృష్ణ, పొన్నం వెంకటేశ్, సౌమ్య, కుర్రి తిరుమలేశ్ కార్యవర్గ సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్,కోకన్వీనర్లు మాట్లాడుతూ న్యాయవాదులు చేసిన కృషి ఫలితంగా పట్టణంలో కోర్టు ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడ్డాయని, కొన్ని అనివార్య కారణాల వల్ల చేర్యాలలో కోర్టు ప్రారంభ అంశం వాయిదా పడిందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసుకున్న కమిటీతో కోర్టును త్వరగా ప్రారంభింపజేసేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు రథోత్సవం

లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

వర్గల్, ఏప్రిల్ 7: నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో కీలకఘట్టమైన స్వామివారి విమానరథోత్సవానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్వామి వారి రథోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఇందుకోసం వాహనాల పార్కింగ్, తాగునీటి కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా రథపూజ, దేవతామూర్తుల రథ ఊరేగింపునకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఈవో అన్నపూర్ణ పర్యవేక్షణలో స్వామి వారి సన్నిధిలో పూజలు, యాగశాలలో హోమం నిర్వహించారు. సోమవారం ఉదయం 5:30 గంటలకు రథం ఊరేగింపు ప్రారంభమవుతున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

మట్టి స్నానంతో వ్యాధులు దూరం

యోగాసనాలు వేస్తున్న యోగా సాధకులు

సిద్దిపేట, ఏప్రిల్ 7: మట్టి స్నానంతో వివిధ రకాల వ్యాధులను దూరం చేసే అవకాశం ఉంటుందని ప్రముఖ వైద్యుడు డాక్టర్ బీ.ఎన్ స్వామి అన్నారు.ఆదివారం సిద్దిపేటలోని చంద్రమౌళి గార్డెన్‌లో వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో సామూహిక మట్టి స్నానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి , సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ , గౌరవాధ్యక్షుడు కె. అంజయ్య, గంగాపురం శ్రీనివాస్ బసవరాజు కుమార్, పల్లె సురేశ్, రాజమల్లయ్య , వేణు, భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రంగాచారి, జిల్లా భారత స్వాభిమాన్ ట్రస్ట్ సభ్యులు రాములు, ఎస్ఎస్‌వై వాసు పాల్గొన్నారు.

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

- కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో మండల స్థాయి కార్యకర్తల సమావేశం

జక్కాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పక్కన మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

నారాయణరావుపేట, ఏప్రిల్ 7: గులాబీ జెండానే అందరికీ శ్రీరామరక్ష అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మండల పరిధిలోని జక్కాపూర్‌లో శనివారం రాత్రి జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్యారెంటీలకు తనది జిమ్మేదారి అన్న రాహుల్‌గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రాహుల్ ఇచ్చిన హామీలు 120 రోజులు అయినా నెరవేరలేదని.. నేడు రాహుల్ గాంధీ విడుదల చేస్తున్న జాతీయ మ్యానిఫెస్టోను ఎవరూ నమ్మరన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను చట్టబద్ధం చేస్తామని రేవంత్‌రెడ్డి మోసం చేశాడని.. రుణమాఫీ, రైతు భరోసా, తులం బంగారం, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు, మహాలక్ష్మి పథకం ఇలా ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి మన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తీసుకుపోయాడని.. రూ.150 కోట్ల అభివృద్ధి పనులను రద్దు చేశాడని.. ఇది అన్యాయం కాదా.. అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నా లేకున్నా సిద్దిపేట గడ్డకు తక్కువ చేయలేదన్నారు. నాటి నుంచి నేటి వరకు నారాయణరావుపేట బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ అందించిందని.. నేడు కూడా ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఘన విజయం అందించాలన్నారు. ట్రస్ట్ సేవలు మీకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రఘునందన్‌రావు దోఖా చేయడంతోనే దుబ్బాకలో ప్రజలు ఓడగొట్టారని, నేడు కూడా డిపాజిట్ కోల్పోవడం ఖాయమన్నారు. బీజేపీ ఒక్క మంచి పని చేసిందా.. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని, నిరుద్యోగం పెరిగిందని, గ్యాస్ ధరలు పెంచారన్నారు. కాళేశ్వరం తొలి ఫలితం నారాయణరావుపేటకే వచ్చిందని.. నాకు ఎక్కువ ఏకగ్రీవాలు ఇచ్చిన మండలం కూడా ఇదేనని.. మిమ్మల్ని మరువలేనన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ..కలెక్టర్‌గా ఖ్యాతి ఇచ్చిన ఈ గడ్డకు తనకు రాజకీయ జీవితం కూడా ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పని చేశానని, పార్లమెంట్‌లో ఒక మాజీ కలెక్టర్‌గా అడుగుపెట్టే అవకాశం ఇవ్వాలన్నారు. పరిపాలనా అనుభవంతో మీ సమస్యల పరిష్కారం సులువు అవుతుందన్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు అండగా ఉంటానన్నారు. యువతీ, యువకులకు కోచింగ్ కేంద్రాలు, వృత్తి శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి, జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలకు సైతం కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి అండగా ఉంటానని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నిరుపేదల కోసం ఏడు నియోజకవర్గాల్లో ఫంక్షన్‌హాళ్లు నిర్మించి కేవలం ఒక్క రూపాయికే వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన మహిళలు, కార్యకర్తలు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 7: హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొండపాక మండలంలోని దుద్దెడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరువు వచ్చిందన్నారు. రైతుకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.4వేల పింఛన్, మహిళలకు రూ.2500, రైతాంగానికి కావాల్సిన నాణ్యమైన 24 గంటల కరెంట్‌తో పాటు సాగు, తాగు నీరు ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. వాగ్దానాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ఫోన్ ట్యాపింగ్ అంటూ ప్రజలను తప్పుదోవ పటించే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన మోసాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుందామన్నారు. ఈ నెల 11న దుద్దెడ వైష్ణవి గార్డెన్‌లో మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, రైతుబంధు సమితి మాజీ మండల కో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, నాయకులు పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, ఆరేపల్లి మహాదేవ్‌గౌడ్, తాజా మాజీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమాజ జాగృతంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ఉమ్మడి కొండపాక మండల జర్నలిస్టుల సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 7: సమాజాన్ని జాగృతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొండపాక మండలంలోని దుద్దెడలో ఉమ్మడి కొండపాక మండల జర్నలిస్టుల సంఘం నూతన కార్యాలయాన్ని జర్నలిస్టుల సంఘం మండలాధ్యక్షుడు చిలుముల వెంకటేశంతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, సమాజానికి మధ్య వారధిగా ఉంటారన్నారు. ప్రజల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, రైతు బంధు సమితి మాజీ మండల కో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వాసరి లింగరావు, నాయకులు పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, ఆరేపల్లి మహాదేవ్‌గౌడ్, బాకీ ప్రభాకర్, బూర్గుల సురేందర్‌రావు, బట్ట పరుశరాములు, తాజా మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కష్టాలకు కుంగిపోకుండా ముందుకు సాగాలి

మాట్లాడుతున్న ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 7: కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జనజాగృతి కళాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జానజాగృతిక కళాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్‌కుమార్, కౌన్సిలర్ వాల సుప్రజ, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, మాజీ కౌన్సిలర్ గాదపాక రవీందర్, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, మేకల వీరన్న యాదవ్, పందిళ్ల శంకర్, ఎనగందుల శంకర్, దేవర కనకయ్య, బూట్ల రాజమల్లయ్య, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, లక్ష్మణ్, సత్యనారాయణ, ప్రవంతి, రవీందర్, సాంబమూర్తి, రమేశ్ పాల్గొన్నారు.



మల్లేశంపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు, అలయ కమిటీ నిర్వాహకులు

శివపార్వతుల కల్యాణం

రాయపోల్, ఏప్రిల్ 7: దౌల్తాబాద్ మండలంలోని మల్లేశంపల్లిలో అభయాంజనేయ శివపంచాయతన వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉదయం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకం, హోమం, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. స్వామివారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ దారా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

జగదేవ్‌పూర్, ఏప్రిల్7: జగదేవ్‌పూర్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఎర్ర బాలయ్య కుటుంబ సభ్యులను ఆదివారం పలువురు మండల నాయకులతో కలిసి బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి అయిలయ్యయాదవ్ పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. బీజేపీ నాయకులు కందుల బాలరాజు, పేర్లశ్రీనివాస్ నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కుమార్‌లింగారికరుణాకర్, బండారి మల్లేశం, అజిత్‌కుమార్‌రెడ్డి, కనకయ్య, కృష్ణ, శేఖర్, మహేశ్, రాజయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సిద్దిపేట, ఏప్రిల్ 7: సిద్దిపేటలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ అనుమతితో పాత బస్టాండ్ వద్ద, భక్తుల కోసం వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తోటపల్లిలో..

బెజ్జంకి, ఏప్రిల్ 7: మండలంలోని తోటపల్లిలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బాటసారులు, గ్రామస్తులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సుజాత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆపన్నహస్తమిత్ర బృందం సభ్యులు

గజ్వేల్, ఏప్రిల్ 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న మండలంలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన శివగల్ల మధుకృష్ణ ఆరోగ్య ఖర్చుల కోసం ఆపన్నహస్తమిత్ర బృందం ఆదివారం రూ.20వేల ఆర్థికసాయాన్ని ఆయన తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శ్యామ్, ప్రసాద్, స్వామి, బాలశేఖర్‌రెడ్డి, అరవింద్, ధనరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మూతపడిన ట్రిపుల్ ఆర్ కేంద్రం

హుస్నాబాద్‌లోని ట్రిపుల్‌ఆర్ కేంద్రం

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 7: ఆర్..ఆర్..ఆర్.. (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) ట్రిపుల్ ఆర్ కేంద్రం రెండు నెలలుగా మూతపడింది. జీవనశైలిలో మనకు అవసరంలేని, ఉపయోగపడని వాటిని ఇతరులు ఉపయోగించుకునే అవకాశం కల్పించేందుకు ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని గత ఏడాది చేపట్టారు. పట్టణాలను శుభ్రంగా ఉంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందుకోసం ప్రత్యేకంగా మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కేంద్రంలో ప్లాస్టిక్ వస్తువులు, వాడిన దుస్తులు, పుస్తకాలు, చెప్పులు, షూలను భద్రపర్చారు. అయితే రెండు నెలలుగా ఈ కేంద్రాన్ని నిర్వహించకుండా అధికారులు మూసివేశారు. దీంతో నిరుపయోగంగా ఉన్న వస్తువులను జనం చెత్తకుప్పల పాలు చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్రిపుల్‌ఆర్ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దొంగలున్నారు జాగ్రత్త!

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7: వేసవిలో చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని.. కమిషనరేట్ పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట సీపీ అనురాధ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని.. పగలు, రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో పెరిగిన ఎండలు, పిల్లలకు సెలవు ఉండటంతో చాలామంది ప్రయాణాలు చేస్తారని.. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని.. విహార యాత్రలు, తీర్థయాత్రలు, ఊర్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 8712667100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

సన్మార్గంలో నడుచుకోవాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 7: భగవంతుడి ఆశీస్సులతో మనందరం సన్మార్గంలో నడుచుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. శ్రీపార్థసారథి గీతాభక్త సమాజం 37వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వాల సుప్రజ, గీతా భక్త సమాజానికి చెందిన వెల్దండి శివరామ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోటి తలంబ్రాల దీక్ష

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 7: భద్రాచలం సీతారాముల కల్యాణానికి గ్రామ గ్రామాన కోటి తలంబ్రాల దీక్ష చేపట్టినట్లు శ్రీ రామ కోటి భక్త సమాజం అధ్యక్షుడు రామకోటి రామరాజు అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోటి తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. ఒడ్లను ఒలిపించి అక్షింతలు తయారు చేయించారు. కార్యక్రమంలో పెద్దిశంకర్, పంటేరునర్సింహారెడ్డి, చంద్రశేఖర్, కొండల్, లక్ష్మీనర్సయ్య, రాజయ్య, వెంకటేశ్, రఘురామ్, రామకృష్ణ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి బస్సు నడపాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 7: మద్దూరు మండల కేంద్రం నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రం వరకు ఆర్టీసీ బస్సు నడపాలని మద్దూరు మాజీ ఎంపీటీసీ భూర్గు నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మారుమూల మండలమైన మద్దూరు నుంచి సిద్దిపేటకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక మద్దూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు మద్దూరు నుంచి సిద్దిపేటకు బస్సు నడపాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 7: మద్దూరు మండల కేంద్రంలో క్రాంతి గ్రామైక్య సంఘం ఆ